



ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో సలహా మండలి మాజీ అధ్యక్షులు నూతలపాటి శ్రీకృష్ణ, ఏఈఓ పార్థసారధి, మాజీ సభ్యులు - వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చిన భక్తులు - టీటీడీ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో పద్మావతీసమేత వెంకటేశ్వరస్వామి



గోవిందనామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు

- వైకుంఠద్వార ప్రవేశంతో పులకించిన భక్తులు



శ్రీరంగంలో రంగనాథస్వామి పల్లకీ సేవ

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుప్రసిద్ధ వైష్ణవాలయాలు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేకువజామున వైకుంఠ ద్వారాలు తెరచుకున్నాయి. వైకుంఠ ద్వార దర్శనాల కోసం భక్తులు గురువారం అర్థ రాత్రే ఆలయాలకు చేరుకున్నారు. వైష్ణవ ఆలయాలను విశేషంగా అలంకరించారు. వైకుంఠ ద్వారా దర్శనానికి పోటెత్తిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక వసతులు కల్పించగా రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.

శ్రీరంగంలో...

తిరుచ్చి సమీపంలో భూలోక వైకుంఠం శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయంలో 'పరమ పదవాసల్'గా కీర్తి గడించిన వైకుంఠ ద్వార దర్శన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. సుమారు 2లక్షల మందికి పైగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయప్రాంగణం మారుమ్రోగింది. ఈ ఆలయంలో గత 30వ తేదీ ధ్వజారోహణంతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ ఆలయంలోని వైకుంఠ ద్వారాన్ని తెల్లవారు జాము 4.15 గంటలకు తెరిచారు. విశేషాభరణాలతో అలంకరించిన నంబెరుమాళ్‌ను పల్లకీలో ఉంచి బంగారు ధ్వజస్థంభం చుట్టూ ప్రదక్షణ చేసి ఉదయం 5.15 గంటలకు వైకుంఠ ద్వారం దగ్గరకు తీసుకువచ్చారు. ఆలయపూజారుల మంత్రోచ్ఛారణ. మేళతాళాల మధ్య వైకుంఠ ద్వారాన్ని తెరిచారు. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, నంబెరుమాళ్ దర్శనం చేసుకున్నారు. నగర పోలీసు కమీషనర్ కామిని నేతృత్వంలో 2వేల మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం నుంచి 15వ తేదీ వరకు మధ్యాహ్నం 1గంట నుంచి రాత్రి 8 గంటల వరకు, 16న సాయంత్ర 4గంటల నుంచి 8 గంటల వరకు వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. రాపత్తు ఉత్సవాల్లో 8వ రోజైన 17వ తేదీ మినహా 18వ తేదీ మధ్యాహ్నం 1గంట నుంచి 8గంటల వరకు, 19న ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వైకుంఠ ద్వార దర్శనం వుంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

పార్థసారధి ఆలయంలో...

స్థానిక ట్రిప్లికేన్ పార్థసారధి ఆలయంలోఓ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం వేకువ జామున ప్రారంభమైయ్యాయి. ఈ ఆలయంలో పగల్ పత్తు వేడుకలు చివరి రోజు కావడం, మరోవైపు వైకుంఠ ఏకాదశి పర్వదినం, తిరువాయిమోళి అనే రాపత్తు వేడుకలు ఒకేసారి రావడంతో ఆలయ అర్చకులు స్వామి వారికి మహా అభిషేకం, అర్చన, విశేష అలంకరణ నిర్వహించారు. గురువారం రాత్రి 7 గంటల నుంచే భక్తులు వైకుంఠ ద్వార దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. సర్వాలంకరణ శోభితులై, ఇష్టదేవేరులతో పార్థసారధి స్వామి వారు మంగళ వాయిద్యాలు, వైష్ణవ పండితుల కీర్తనల నడుమ వైకుంఠ ద్వారం చేరుకుని భక్తులకు దర్శినమిచ్చారు.

టీటీడీ ఆలయంలో...

స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని టీటీడీ సమాచార కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆభరణాలు, వివిధ రకాల పూలతో స్వామివారినివిశేషంగా అలంకరించారు. ఆలయాన్ని అరటిచెట్లు, పూలతో అలంకరించారు. శుక్రవారం వేకువజాము 3గంటలకు ప్రత్యేక పూజల అనంతరం వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమైంది. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వెంకటనారాయణ రోడ్డులో ఒక వైపు వాహనాల రాకపోకలు నిషేధించారు. ఈ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుకుండా ఆలయ యాజమాన్యం పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ చెన్నై సమాచారకేంద్ర ఏఈఓ పార్థసారథి, సలహామండలి మాజీ అధ్యక్షులు, మాజీ సభ్యులు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.




శ్రీవారిని దర్శించుకుంటున్న సూపర్‌స్టార్ రజనీ సతీమణి లత - సేవా కార్యక్రమాల్లో టీటీడీ సలహామండలి మాజీ సభ్యులు



అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

అతివల భద్రతే అంతిమ లక్ష్యం

- రాష్ట్రంలో మహిళలకు తిరుగులేని రక్ష
- ఆకతాయిలకు చెల్లుచీటీ
- అత్యాచారానికి పాల్పడితే మరణశిక్షే
- అసెంబ్లీలో ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టిన సీఎం

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలకు దిగింది. ఇందులో భాగంగా మహిళలపై అత్యాచారానికి పాల్పడేవారికి ఇకపై మరణశిక్ష విధించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ముసాయిదాను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సభలో ప్రవేశపెట్టారు. 'డ్రాఫ్ట్ బిల్ టు ప్రొహిబిట్ హెరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ 2025' పేరుతో ఈ ముసాయిదా బిల్లును రూపొందించారు. ఈ చట్టం అమల్లోకి వస్తే మహిళల వెంటపడినా, వారిని వేధించినా నేరంగా పరిగణించి ఐదేళ్ళ శిక్ష విధిస్తారు. అత్యాచారాలకు పాల్పడితే మాత్రం గరిష్ఠంగా మరణశిక్ష విధించేలా ఈ బిల్లు రూపొందించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ. డీఎంకే ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాజకీయ, ఆర్థికరంగాల్లో మహిళలను ప్రోత్సహించడంతో పాటు వారు ప్రగతిబాటలో పయనించేలా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలకు సురక్షితమైన రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందన్నారు. మహిళలు ఉపాధి, ఉద్యోగాలకు వెళుతూ సమాజాభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రగతికి కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారన్నారు. అయితే, కొన్ని సమయాల్లో మహిళలు వేధింపులకు గురికావడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పిస్తూ, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న కృతనిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను తమ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచి వేస్తుందన్నారు. మహిళలపై లైంగిక నేరాలు ఏమాత్రం క్షమార్హం కావన్నారు. ఇలాంటి క్రూరమైన నేరాలకు పాల్పడే వారికి విధించే శిక్షలను కఠినతరం చేసేలా ఈ ముసాయిదా బిల్లును రూపొందించామన్నారు. మహిళలకు మరింత భద్రత కల్పించేలా, లైంగిక దాడులు, అత్యాచారాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా రూపొందించిన ఈ ముసాయిదా బిల్లును సభలో ప్రవేశపెడుతున్నామని, దీనికి సభ్యులంతా స్వాగతించి ఏకగ్రీవంగా ఆమోదించాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ ముసాదా బిల్లు ప్రకారం 12 యేళ్ళలోపు బాలికలు, 18 యేళ్ళలోపు యువతులు, మహిళలపై అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష విధిస్తారు. 12 యేళ్ళలోపు బాలికలను వేధిస్తే కఠిన జీవితకారాగార శిక్ష లేదా మరణ శిక్ష విధిస్తారు. 18 యేళ్ళలోపు యువతులపై సామూహిక వేధింపులకు పాల్పడితే జీవితకారాగార శిక్ష విధిస్తారు. కొన్ని కేసుల్లో బాధిత మహిళల వివరాలను బహిర్గతం చేస్తే 3 లేదా ఐదేళ్ళ జైలుశిక్ష, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే 3 నుంచి ఐదేళ్ళవరకు జైలుశిక్ష, యాసిడ్ దాడి వంటి కేసుల్లో నిందితులకు పదేళ్ళ జైలు శిక్ష విధించేలా ఈ బిల్లును రూపొందించారు.

ఐసీఎఫ్ సేవలు అమోఘం

- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కం నియోజకవర్గం పరిధిలోని ఇంటగ్రల్ కోచ్ ఫాక్టరీ (ఐసీఎఫ్) సేవలు అమోఘమని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఐసీఎఫ్‌లో తయారవుతున్న అమృత్ భారత్ 2.0 స్లీపర్ బోగీలను శుక్రవారం ఉదయం కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైళ్ల రవాణా వ్యవస్థను అభివృద్ధి పరచేలా కేంద్రప్రభుత్వం వివిధ కొత్త పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. రైళ్ల బోగీల తయారీలో ప్రపంచ దేశాలతో ఐసీఎఫ్ పోటీపడుతోందని, దూర ప్రాంతాలకు నడిపే రైళ్లలో ప్రయాణికులకు అవసరమైన వసతులను సమకూర్చుతున్నట్లు తెలిపారు. వందే భారత్ రైళ్లలో పయణించే అనుభూతిని పేద, మధ్య తరగతి ప్రజల్లో కూడా కలిగించాలన్న లక్ష్యంతో తక్కువ చార్జీలతో అమృత్ భారత్ రైళ్లను నడుపుతున్నామని, ఈ రైళ్లకు ప్రజాదరణ పెరుతున్న దృష్ట్యా, ప్రస్తుతం అమృత్ భారత్ స్లీపర్ రైళ్లను ఐసీఎఫ్ హైటెక్ వసతులతో తయారు చేస్తోందని రైల్వేమంత్రి వివరించారు. రైల్వేశాఖ అధ్వర్యంలో తమిళనాడులో అమలుచేసే కొత్త పథకాలకు రాష్ట్రప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. తూత్తుకుడి నుండి అరుప్పుకోట మీదుగా మదురైకు కొత్త రైలు మార్గం ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అభ్యంతరం తెలిపినందున ఆ పథకాన్ని పూర్తిగా విరమించుకున్నట్లు చెప్పారు. అదే విధంగా రామనాథపురం జిల్లా రామేశ్వరంలో పాంబన్ రైల్వే వంతెన నిర్మాణం పూర్తికావడంతో ప్రస్తుతం ట్రయల్ రన్ విజయవంతంగా జరుగుతోందని, త్వరలోనే ఈ వంతెన ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే జమ్మూకశ్మీర్ మధ్య పూర్తయిన రైలు మార్గంలో త్వరలోనే రైలు సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2024 ఆర్థిక సంవత్సరం రైల్వే అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల నుంచి ఇప్పటికి 76 శాతం ఉపయోగించుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

కొత్త విద్యా విధానంతో పురోగతి

- గవర్నర్ ఆర్ఎన్ రవి



సావనీర్ ఆవిష్కరణలో గవర్నర్ ఆర్ఎన్ రవి, వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

వేలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా విధానంతో విద్యా రంగం మరింత పురోగతి సాధిస్తుందని గవర్నర్ ఆర్ఎన్ రవి అభిప్రాయపడ్డారు. వీఐటీ యూనివర్సిటీలో సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్ల రెండు రోజుల సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అఖిల భారత యూనివర్సిటీల సమాఖ్య అధ్యక్షుడు వినయకుమార్ పథక్ అధ్యక్షత వహించగా, సెక్రటరీ పంకజ్ మిట్టల్ ఆహ్వానం పలికారు. ఈ సమావేశాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన గవర్నర్ రవి మాట్లాడుతూ... ఆంగ్లేయుల కాలం నాటి విధానంతో నేటి విద్యా రంగం ఉందన్నారు. ఈ విద్యా రంగంలో సమూల మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కొత్త విద్యా విధానం దేశాభివృద్ధి, విద్యా రంగాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ సహా పలు రంగాల్లో కొత్త ఆవిష్కరణలు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, రాష్ట్రంలోని పలు వర్శిటీలు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలకు చెందిన 120 వర్శిటీ ఛాన్సలర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సావనీర్‌ను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆవిష్కరించి, తొలిప్రతి వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌కు అందజేశారు.

సాగరంపై సేతువు నిర్మాణం ?

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సరికొత్త మార్గం
- సముద్రంపై వంతెన నిర్మాణానికి సన్నాహం
- లైట్ హౌస్ నుంచి నీలాంగరై వరకు
- సాధ్యాసాధ్యాలపై నిపుణుల అధ్యయనం
- మంత్రి ఏవీ వేలు వెల్లడి



చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు వీలుగా పట్టినంబాక్కం (లైట్ హౌస్) నుంచి నీలాంగరై వరకు సముద్రంపై వంతెన నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ వంతెన నిర్మాణ సాధ్యాసాధ్యాలపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారని రాష్ట్ర ప్రజాపనుల శాఖామంత్రి ఏవీ వేలు ప్రకటించారు. శుక్రవారం శాసనసభ జీరో అవర్‌లో ఉప సభాపతి పిచ్చాండి మాట్లాడుతూ... 'ముంబై నగరంలో సముంద్రంపై అటల్ సేతు వారధి నిర్మించినట్టుగా, ధనుష్కోటి నుంచి శ్రీలంక వరకు వంతెన నిర్మించే ఉద్దేశమేమైనా వుందా ప్రశ్నించారు. దీనికి మంత్రి వేలు సమాధానమిస్తూ, శ్రీలంకలో నెలకొన్న అంతర్గత పోరు, రాజకీయ అనిశ్చితి కారణంగా ఈ ప్రాజెక్టు ఒక కలగా మిగిలిపోయిందన్నారు. 2015లో భారత పర్యటనకు వచ్చిన నాటి లంక ప్రధాని రణిల్ విక్రమసింఘే వద్ద కేంద్రమే ధనుష్కోటి నుంచి శ్రీలంక (తలై మన్నార్) వరకు సముద్ర సొరంగ మార్గంలో రహదారి నిర్మాణాన్ని ప్రతిపాదించగా, లంక ప్రధాని తిరస్కరించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పిచ్చాండి జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర రాజధాని నగరమైన చెన్నైలో పట్టినంబాక్కం నుంచి మహాబలిపురం వరకు సముద్రంపై వంతెన నిర్మాణానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి వేలు సమాధానమిస్తూ.. ఈ తరహా వంతెన నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే ఇంజనీర్లు అధ్యయనం చేస్తున్నారన్నారు ఈ వంతెనను కేంద్ర, రాష్ట్ర నిధులతో నిర్మించాలా లేదా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్మించాలా తదితర అంశాలపై పరిశీలన సాగుతోందన్నారు. అదేసమయంలో ముంబైలో నిర్మించిన వంతెనను తాను చూశానని, ఈ తరహా వంతెన చెన్నై నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు వీలుగా పట్టినంబాక్కం నుంచి నీలాంగరై వరకు నిర్మించే విషయంపై ఇంజనీర్లు పరిశీలిస్తున్నారని, ఇదే అంశంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఏవీ వేలు వివరించారు.

సమాచార దృష్టి

వృత్తి విద్య పాఠశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో కొత్తగా వృత్తి విద్య పాఠశాలలు ప్రారంభం, ఇప్పటికే పనిచేస్తున్న పాఠశాలలు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కలైసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు రుసుము రూ.5,000, పరిశోధన రుసుముతో కూడిన దరఖాస్తులు ఫిబ్రవరి 28వ తేదిలోపు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో సమర్పించాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

'బెస్ట్ ట్రాన్స్‌జెండర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'బెస్ట్ ట్రాన్స్‌జెండర్' పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... ట్రాన్స్‌జెండర్ దినోత్సవమైన ఏప్రిల్ 15వ తేది, హిజ్రాల సంక్షేమం కోసం కృషిచేస్తున్న వారిని ప్రోత్సహించేలా 'బెస్ట్ ట్రాన్స్‌జెండర్' పురస్కారాన్ని ముఖ్యమంత్రి అందజేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు.జిల్లాకుచెందిన అర్హులైన వారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఫిబ్రవరి 10లోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

15న టాస్మాక్ దుకాణాలకు సెలవు

వాషర్‌మెన్‌పేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

నేడు పొంగల్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06101 చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి ప్రత్యేక రైలు శనివారం (ఈ నెల 11వ తేది) చెన్నై ఎగ్మూర్‌లో రాత్రి 10.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు తిరునల్వేలి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06102 తిరునల్వేలి-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేది తిరునల్వేలిలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 2.40 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.
- నెం.06099 తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు శనివారం (ఈనెల 11వ తేది) తాంబరంలో రాత్రి 9.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.20 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06100 నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 12వ తేది నాగర్‌కోయిల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి అర్ధరాత్రి 12.05 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- నెం.06067 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-మదురై ప్రత్యేక రైలు శనివారం (ఈ నెల 11వ తేది) చెన్నై సెంట్రల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5 గంటలకు మదురై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06068 మదురై-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 12న మదురైలో సాయంత్రం 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

ఇక నుంచి 'తమిళనాడు జైలు'

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యానికి ముందే, రాష్ట్రంలోని జైళ్లు ఆంగ్లంలో 'తమిళనాడు ప్రిజన్' అని పిలుస్తుండగా, ఇకపై 'తమిళనాడు జైలు'గా పేరు మారింది. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీపీ మహేశ్వరి దయాళ్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, తమిళనాడు పోలీసు అనే విధంగా 'టీఎన్‌పీ' అని పోలీసులు బ్యాడ్జి ధరిస్తుంటారు. అలాగే, జైళ్ల శాఖ అధికారులు, పోలీసులు కూడా 'టీఎన్‌జే' అనే బ్యాడ్జి ధరించనున్నారు. అలాగే, జైళ్లలో పనిచేసే అధికారులు, పోలీసులు పాస్‌పోర్ట్ పొందేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీజీపీ ప్రకటనలో తెలిపారు.

రవాణా ఉద్యోగుల సెలవులపై నిషేధం

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు రాష్ట్రవ్యాప్తంగా 14,104 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రత్యేక బస్సులకు డ్రైవర్లు, కండక్టర్లు, బస్సుల పర్యవేక్షణకు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో, రవాణా శాఖలో అన్ని విభాగాల సిబ్బంది, అధికారులు ఈ నెల 20వ తేది వరకు సెలవులు తీసుకోరాదని, అత్యవసర సెలవులకు ఆయా విభాగాల అధికారుల అనుమతి పొందాలని రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

'సిప్కాట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్'లు సిద్ధం

పెరంబూర్,జనవరి10(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసేలా రాష్ట్రంలో ఐదు ఇండస్ట్రియల్ పార్క్‌లు సిద్ధమయ్యాయి. కాంచీపురం జిల్లా వయ్యావూర్‌లో 42 ఎకరాలు, కడలూరు జిల్లా కడంపులియూర్‌లో 29 ఎకరాలు, తూత్తుకుడి జిల్లా లింగంపట్టిలో 60 ఎకరాలు, తిరువారూర్ జిల్లా వండాపాలైలో 19 ఎకరాలు, తిరునల్వేలి జిల్లా ముత్తూర్‌లో 33 ఎకరాల్లో పారిశ్రామికవాడలు సిద్ధమయ్యాయి. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఈ పారిశ్రామికవాడల్లో అన్ని వసతులు సమకూర్చామని, త్వరలో దరఖాస్తు చేసుకున్న పరిశ్రమలకు స్థలాలు కేటాయించి, ఫిబ్రవరిలో ఉత్పత్తులు ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి





కొడుంగైయూర్ సిద్ధి వినాయక సమేత వెంకట ముడయాన్ ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు - కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో పల్లకీ సేవ - కొండితోపు రంగనాథాలయంలో ఉభయ దేవేరులతో స్వామివారు

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని వైష్ణవాలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శనాలను కల్పించి తీర్థ, అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామివార్లకు శాస్త్రోక్తంగా విశేష అర్చన, అలంకార పూజలు నిర్వహించారు.

ఎస్కేపీడీలో...

జార్జ్‌టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైకుంఠ ద్వార ప్రవేశ వేడుకలను ఎస్కేపీడీ ఛారిటబుల్ ట్రస్టీల నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరపంతుల బృందం ప్రారంభించింది. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవి సమేత పెరుమాళ్‌ను హనుమంత వాహనంలో ఊరేగించారు.

వెంకటేశ్వర నగర్‌లో..

స్థానిక కొడుంగైయూర్‌లోని వెంకటేశ్వర నగర్ సిద్ధివినాయక సమేత శ్రీనివాస వెంకట ముడయాన్ ఆలయ ప్రధాన మండపంలో వైకుంఠ ఏకాదశి పూజలను శుక్రవారం వేకువజామున 5.15 గంటలకు ప్రారంభించారు. ఈ నెల 13వ తేదీ సోమవారం రాత్రి 8 గంటలకు ఆండాళ్ తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి నివేద భాస్కర్ బృంద భక్తి సంగీత విభావరి జరుగుతుంది. ఈ నెల 25వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 500 మంది పైగా భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరివెళ్తారు. ఆలయ నిర్వాహకులు ఎస్.రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీహెచ్ శ్రీనివాస్, ఎన్ జగన్నాథం, జి.భాస్కర్, కోడి భావనారాయణ, బీవీఆర్ భాస్కర్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండితోపులో...

స్థానిక కొండితోపు ముల్లావీధిలోని రంగనాథ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి తిరుమంజనం, విశేష అలంకార పూజ చేశారు. శుక్రవారం తెల్లవారుజాము 4గంటల నుంచి స్వామి వారిని ఉత్తర ద్వారం గుండా భక్తులు దర్శనం చేసుకొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జె.హరికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అన్నదానం నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ మురళీ, జె.హరికుమార్

900వ రోజుకు చేరిన 'పరందూర్' వ్యతిరేక ఉద్యమం



పోలీసులతో నిరసనాకారుల వాగ్వివాదం

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపంలోని పరందూర్‌లో కొత్త విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఉద్యమం శుక్రవారం 900వ రోజుకు చేరింది. రాజధాని నగరం చెన్నైలో లాగే రెండో గ్రీన్ ఎయిర్‌పోర్టును కాంచీపురం సమీపంలోని పరందూర్ ప్రాంతంలో నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ భారీ ప్రాజెక్టు కోసం పరందూర్, చుట్టు ప్రక్కల 13 గ్రామాల్లో 5300 ఎకరాల వ్యవసాయ భూముల సేకరణ ప్రారంభించారు.. ఏగనాపురం, నాగపట్టు సహా 13 గ్రామాల ప్రజలు స్థలసేకరణకు ఆరంభంలోనే అభ్యంతరం తెలిపి రైతులకు మద్దతుగా ఆందోళన దిగారు. వీరికి పలు రాజకీయ పార్టీలు కూడా మద్దతుగా నిలిచాయి. ఉద్యమం 900వ రోజుకు చేరుకోవడంతో ఉద్యమకారులు ఏగనాపురం గ్రామం నుంచి బయలుదేరి దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక మందిరంలో వినతి పత్రం సమర్పించి అహింసా మార్గంలో తిరిగిరావాలని నిర్ణయించారు. ఇందుకోసం ఏగనాపురం నుంచి శుక్రవారం ఉదయం బస్సుల్లో బయలుదేరిన ఉద్యమకారులను అడ్డుకున్న పోలీసులు సుమారు 50 మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పరందూర్ విమానాశ్రయ వ్యతిరేక ఉద్యమ కమిటీ ఆర్గనైజర్ ఇళంగో మాట్లాడుతూ, ఐదు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కరుణానిధి స్మారక మందిరంలో తమ కోరికలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించేందుకు కూడా అవకాశం కల్పించట్లేదని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం నెరవేర్చింది లేదని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ కోరిక నెరవేరే వరకు ఉద్యమం ఆగదన్నారు.

● సెంథిల్ బాలాజీ కేసు...

తప్పుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి సెంథిల్ బాలాజి కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి తప్పుకున్న నేపథ్యంలో, కేసు విచారణ 27వ తేదీకి వాయిదాపడింది. మంత్రి సెంథిల్ బాలాజిపై నమోదైన అవినీతి కేసు విచారణ కావాలని జాప్యం చేస్తున్నారని, ఆయన బెయిలు రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో వై.బాలాజీ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభయ్ ఎస్. ఓహా, కేవీ విశ్వనాథన్ నేతృత్వంలో ధర్మాసనం విచారిస్తోంది. ఈ కేసు గురువారం విచారణకు రాగా న్యాయమూర్తి విశ్వనాధన్, తాను న్యాయవాదిగా ఈ కేసుతో సంబంధాలున్న ఓ వ్యక్తి తరపున వాదించానని, ఈ కారణంగా ఈ కేసు విచారణ నుంచి తాను తప్పుకుంటున్నానని, కేసు విచారణ మరో బెంచ్‌కు బదిలీ చేయాలన్నారు. అనంతరం ఈ కేసు విచారణ ఈ నెల 27వ తేదీకి వాయిదాపడింది.

అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తారతమ్యం వద్దు

● పోలీసు శాఖకు హైకోర్టు సూచన

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికార్ల, ప్రతిపక్ష పార్టీలనే తారతమ్యం చూపకుండా, అన్ని వర్గాలకు సమాన న్యాయం చేయాలని రాష్ట్ర పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు సూచించింది. అన్నా విశ్వవిద్యాలయం వద్ద ఆందోళన చేపట్టేందుకు అనుమతించలేదంటూ పీఎంకే దాఖలుచేసిన పిటిషన్ విచారణ శుక్రవారం జరిగింది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది... నిషేధం ఉల్లఘించి ఆందోళన చేపట్టిన డీఎంకే కార్యకర్తలపై కేసు నమోదుచేసినట్లు వివరించారు. అనంతరం న్యాయస్థానం, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అన్న తారతమ్యం చూపరాదు. ఆందోళనల్లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులనే నిందిస్తారన్న న్యాయస్థానం, పీఎంకే పిటిషన్‌కు అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తుర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 23వ తేదీకి వాయిదావేసింది.

మంత్రి సుబ్రమణ్యంకు ఊరట...!

● 22 ఏళ్లు సాగిన కేసు విచారణ



మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇరవై రెండేళ్లు సాగిన కేసు విచారణలో ఎట్టకేలకు శుక్రవారం తీర్పు వెలువడింది. ఈ కేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం సహా ఏడుగురిని విడుదల చేస్తూ చెన్నై ఎంపీ, ఎమ్మెల్యేపై ఉన్న కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

కేసు పూర్వాపరాలు ఇలా...

చెన్నై కార్పొరేషన్ సమావేశం 2002వ సంవత్సరం డిప్యూటీ మేయర్ కరాటే త్యాగరాజన్ నేతృత్వంలో జరిగింది. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న డీఎంకే కార్పొరేటర్లు నగరంలోని కన్నప్పన్ ప్రాంతంలో చేపల దుకాణం టెండర్లపై ప్రశ్న లేవనెత్తారు. ఈ విషయమై అధికార అన్నాడీఎంకే-డీఎంకే కార్పొరేటర్లు మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో డీఎంకే సభ్యులు మైక్, ప్లాస్టిక్ కుర్చీలు సహా పలు వస్తువులతో అన్నాడీఎంకే సభ్యులపై దాడిచేశారని, ఈ దాడిలో అన్నాడీఎంకే సభ్యులు జీవానందం, పరిమళ, మంగయార్‌కాశి, కుమారి తదితరులు గాయపడ్డారని సమాచారం. ఈ వ్యవహారంపై అన్నాడీఎంకే కార్పొరేటర్ సుకుమార్ బాబు, కార్పొరేషన్ కార్యదర్శి రీటా తదితరులు పెరియమేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ప్రస్తుత ఆరోగ్యశాఖ మంత్రి, మాజీ కార్పొరేటర్ ఎం.సుబ్రమణ్యం, మాజీ కార్పొరేటర్లు వీఎస్ బాబు, శివాజి, తమిళ్‌వేందన్, నెడుమారన్, సెల్వి సౌందర్య, కృష్ణగిరి మూర్తి తదితరులకు వ్యతిరేకంగా రెండు కేసులు నమోదుచేశారు. ఎన్నో ఏళ్లుగా సాగిన ఈ కేసుకు సంబంధించి 2019లో పోలీసు శాఖ ఛార్జిషీటు దాఖలుచేసింది. అనంతరం ఈ కేసు విచారణ ఎంపీ, ఎమ్మెల్యేపై నమోదైన కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జయవేల్ సమక్షంలో విచారణ సాగుతోంది. పోలీసుల తరఫున 70 మంది సాక్ష్యుల విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. వాదనలు ముగిసిన నేపథ్యంలో, ఆరోపణలు నిర్ధారణ కాకపోవడంతో, మంత్రి సుబ్రమణ్యం సహా ఏడుగురిని ఈ కేసు నుండి విడుదల చేస్తూ న్యాయమూర్తి జయవేలు శుక్రవారం తీర్పు వెలువరించారు.

ముఖ్యమంత్రి పేరుతో 'రీచార్జ్'

● మోసపోవద్దని సైబర్ క్రైం హెచ్చరిక



సెల్‌ఫోన్‌కు వస్తున్న మెసేజ్

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్, అందరికి మూడు నెలల 'రీచార్జ్' చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న మెసేజ్‌లు నమ్మరాదని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చిత్రంతో ప్రభుత్వ పథకాల్లో చేరగోరువారు అనే లింక్ క్లిక్ చేయాలంటూ మోసానికి పాల్పడుతున్న ఘటనలు దేశంలోని పలు రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. తాజాగా, 'న్యూఇయర్ రీచార్జ్ ఆఫర్' పేరుతో నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ రెండు నెలల రీచార్జ్ రూ.749 ఇస్తున్నారు. ఇందుకోసం 'లింక్ క్లిక్ చేయాలి' అని సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఇలాంటి మెసేజ్ నమ్మవద్దని, ఆ మెసేజ్‌లోని లింక్ క్లిక్ చేస్తే నష్టపోయే ప్రమాదముందని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రాజధాని నుంచి 3,537 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) శుక్రవారం నుంచి 13వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనుంది. ఆ ప్రకారం, నగరం నుంచి 3,537 బస్సులు నడుపనున్నారు. సాధారణ రోజుల్లో నగరం నుంచి ఇతర నగరాలకు 2,092 బస్సులుండగా, పొంగల్ సందర్భంగా అదనంగా 5,736 బస్సులు నడుపనున్నారు. ఆ ప్రకారం నాలుగు రోజుల్లో మొత్తం 14,104 బస్సులు సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి మొత్తం 21,904 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

విమాన ఛార్జీలకు రెక్కలు...

రాష్ట్రంలోని ఇతర నగరాలు, పొరుగు రాష్ట్రాలకు త్వరగా వెళ్లేందుకు ఆర్థిక స్తోమత కలిగిన వారు విమానాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో, ఒక్కసారిగా విమాన ఛార్జీలు పెరిగాయి. రూ.4,300 ఉండే చెన్నై-మదురై ఛార్జీ, పండుగ సందర్భంగా 11వ తేది ప్రయాణానికి రూ.14,621 వసూలుచేస్తున్నారు. అలాగే, శుక్రవారం గణాంకాల ప్రకారం, 12వ తేది రూ.10,911, 13న రూ.7,164గా ఉంది. అలాగే, మదురై నుంచి చెన్నైకి ఈ నెల 19వ తేది రూ.10,294 ఛార్జీ వసూలుచేస్తున్నారు. అలాగే, కొన్ని నగరాలకు వెళ్లే విమాన ఛార్జీలు మూడు రెట్లు పెరిగాయని ప్రయాణికులు వాపోతున్నారు.

పెరియార్‌పై వివాదాస్పద వ్యాఖ్యలా?

● సీమాన్‌పై మంత్రి దురైమురుగన్ ఆగ్రహం

● రాష్ట్ర వ్యాప్తంగా 60 కేసుల నమోదు

అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తంతై పెరియార్‌ను కించపరిచేలా మాట్లాడిన నామ్ తమిళర్ కట్చి (ఎన్ఎంకే) ఆర్గనైజర్, సినీ దర్శకుడు సీమాన్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 60 కేసులు నమోదయ్యాయి.చెన్నైనగరంలోనే మూడు కేసులు నమోదు చేశారు. అదేసమయంలో సీమాన్ వ్యాఖ్యలను అన్ని రాజకీయ పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. ఎన్ఎంకే ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సీమాన్ మహిళలను కించపరిచేలా తంతై పెరియార్‌ను పేర్కొంటూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. సీమాన్ చేసిన ఆ వ్యాఖ్యలు ఇపుడు వివాదాస్పదమయ్యాయి. ద్రావిడ కళగం, డీఎంకే నేతలతోపాటు పలు ద్రావిడ సంస్థల నేతల ఫిర్యాదు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 60 కేసులు నమోదయ్యాయి.చెన్నైపోలీస్ కమిషనరు కార్యాలయంలో సీమాన్‌పై డీఎంకే నేతల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కోవైలో ద్రావిడ కళగం నేత ఫిర్యాదు ఇవ్వగా, సేలం, తెన్‌కాశి, తంజావూరు జిల్లాల్లో దాదాపు 20 కేసులు నమోదయ్యాయి. ఇదిలావుంటే, సీమాన్‌పై డీఎంకే సీనియర్ నేత దురైమురుగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పెరియార్‌ను కించపరిచేలా వ్యాఖ్యానించి, శాంతివనంగా ఉన్న రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రవర్తిస్తున్నారనీ, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుని పోతుందన్నారు. పెరియార్ సిద్ధాంతాలను రాష్ట్రం ఇప్పటికీ అనుసరిస్తూనే ఉందన్నారు. అందుకే ఈ భూమిని పెరియార్ మట్టిగా అభివర్ణిస్తారన్నారు. కొన్ని మట్టిబుర్రలకు ఈ విషయం అర్థంకాదన్నారు. ఎవరికో రాజకీయ ఏజెంటుగా పనిచేసే కొందరు ఈ తరహా ఆరోపణలు చేస్తుంటారన్నారు. పెరియార్ లక్ష్యాలు, సిద్ధాంతాలను ఆయన జీవించి వున్నపుడే అనేక ప్రభుత్వాలు అమలు పరిచాయన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిపై దుష్ప్రచారం చేసే వారిని రాజకీయ క్షేత్రంలో బహిష్కరిద్దామని దురైమురుగన్ పేర్కొన్నారు.

రాష్ట్రానికి పన్నుల వాటా రూ.7,057 కోట్లు

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.7,057 కోట్లు విడుదల చేసింది. ఈ విషయమై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రాల పన్నుల వాటాగా రూ.1,73,030 కోట్లు విడుదల చేశామని, డిసెంబరులో రూ.89,086 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపింది. పెట్టుబడులు పెంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించేలా ఈ ఏడాది అదనపు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారుల నియామకం

● ముసాయిదాను వ్యతిరేకించిన కాంగ్రెస్

అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదా బిల్లును డీఎంకే కూటమి భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ వ్యతిరేకించింది. రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 2019లో ఎన్నికలు జరగగా, ప్రజాప్రతినిధుల పదవీకాలం జనవరి ఐదో తేదీతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థలకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించేందుకు ముసాయిదా బిల్లును శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టగా కాంగ్రెస్ పార్టీ సభ్యులు మాత్రం బిల్లును వ్యతిరేకించారు. అదేసమయంలో స్థానిక సంస్థలకు ఎన్నికలను తక్షణం నిర్వహించాలని ఆ పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు.

24కి ఆమ్‌స్ట్రాంగ్ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు విచారణ ఈ నెల 24వ తేదీకి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు వాయిదావేసింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న వారిని జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం విచారణకు హాజరుపరిచారు. వారిలో కొందరు తమ తరఫున వాదించేందుకు న్యాయవాదులను నియమించుకోలేదని తెలుపడంతో, విచారణ వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

అయ్యప్ప భక్తులకు 5 లక్షల బిస్కెట్లు

● జెండా ఊపి పంపించిన మంత్రి శేఖర్‌బాబు



వాహనానికి జెండా ఊపుతున్న మంత్రి శేఖర్ బాబు తదితరులు

అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఆలయాల తరపున అయ్యప్ప భక్తులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం రెండో దశగా మరో 5 లక్షల బిస్కెట్ ప్యాకెట్ల లోడు వాహనానికి దేవాదాయ శాఖామంత్రి వీకే శేఖర్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రతి యేటా మకర జ్యోతి పుణ్యకాలమైన 21 రోజుల్లో రాష్ట్రం నుంచి లక్షలాది మంది భక్తులు వెళ్తారని చెప్పారు. వీరికి తమ శాఖ తరపున బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ళను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. తొలి దశలో బిస్కెట్ ప్యాకెట్లతో పాటు ఫ్లాస్కులను కూడా పంపిణీ చేశామన్నారు. రెండో దశలో 5 లక్షల ప్యాకెట్లను పంపిచినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆర్.ప్రియ, హిందూ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ సుకుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడికి 40 ఏళ్ల జైలు శిక్ష

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో యువకుడికి 40 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. తిరువారూరు జిల్లా కోట్టూరు గార్డెన్ ప్రాంతానికి చెందిన ఫక్రుద్దీన్ కుమారుడు అజార్ (25) ఓ మైనార్ బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి 2020లో అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఆ బాలిక గర్భం దాల్చడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, తిరుత్తురైపూండి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరువారూరు మహిళా కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నిందితుడు అజార్‌కు 40 ఏళ్ల జైలుశిక్ష, రూ.4,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శరత్‌రాజ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బాధితురాలికి రూ.6 లక్షలు పరిహారం అందించాలని ప్రభుత్వానికి ఆదేశించారు.

అడవిపందుల కాల్చివేతకు అనుమతి

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పొలాలు ధ్వంసం చేసే అడవి పందులను కాల్చివేసేందుకు అటవీ శాఖకు అనుమతులు ఇచ్చినట్లు ఆ శాఖ మంత్రి పొన్ముడి తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం మంత్రి మాట్లాడుతూ.. రిజర్వ్ ఫారెస్ట్ నుంచి 1-3 కి.మీ పరిధిలోకి అడవి పందులు వస్తే కాల్చవచ్చన్నారు. అదే సమయంలో రైతులు పందులను కాల్చడంపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విడుదల ఉత్తర్వులు రద్దు

వాషర్‌మెన్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో, మాజీ ఎమ్మెల్యే జ్ఞానశేఖరన్, ఆయన భార్యను విడుదల చేస్తూ వేలూరు న్యాయస్థానం జారీచేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. ఏసీబీ దాఖలుచేసి అప్పీలు పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో అభియోగాలు నమోదుచేసి దర్యాప్తు కొనసాగించాలని వేలూరు కోర్టుకు హైకోర్టు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఆదేశాలు జారీచేశారు.

ఏనుగు దాడిలో మహిళ మృతి

వాషర్‌మెన్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో మహిళ మృతిచెందిన ఘటన కృష్ణగిరి జిల్లాలో శుక్రవారం జరిగింది. ఒన్నుకుర్చి గ్రామానికి చెందిన నాగమ్మ (59) కేలమంగళం సమీపం జక్కేరి ప్రాంతంలోని తోటలో పనిచేస్తున్న సమయంలో, పక్కనే ఉన్న పొదల నుంచి వచ్చిన ఏనుగు నాగమ్మను తొండంతో చుట్టా విసిరేసింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో నాగమ్మ మృతిచెందింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సింగపూర్ విమానం అత్యవసర ల్యాండింగ్

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతికలోపంతో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. స్థానిక మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం 150 మంది ప్రయాణికులతో సింగపూర్‌కు విమానం బయల్దేరింది. విమానం టేకాఫ్ తీసుకొన్న కొద్దిసేపటికి విమానంలో సాంకేతికలోపాన్ని గుర్తించిన పైలెట్ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారుల సూచనలతో మళ్లీ విమానాన్ని మీనంబాక్కంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులను విమానాశ్రయంలోని విశ్రాంతి గదులకు తరలించిన అధికారులు, ఇంజనీర్లతో సాంకేతికలోపం సవరించారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుల మృతి

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సిరుముగై పాల్‌కారన్ రోడ్డు ప్రాంతంలో అయ్యప్ప భక్తులు వస్తున్న కారు, అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రం కామరాజ్ నగర్‌కు నుంచి శబరిమలకు ఐదుగురు అయ్యప్ప భక్తులు కారులో బయల్దేరారు. అయ్యప్ప స్వామి దర్శనానంతరం శుక్రవారం ఉదయం వారు కోయంబత్తూర్ జిల్లా సిరుముగై సత్యమంగళం రోడ్డులో వస్తున్నారు. కారు డ్రైవర్ స్వామి కునుకు తీయడంతో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో నాగరాజ్, వెంకటాద్రి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారు యజమానికి రూ.3 లక్షల పరిహారం

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని కారు విక్రయించిన సంస్థ, అందుకు బదులుగా కొత్త కారు ఇవ్వడంతో పాటు రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని నామక్కల్ జిల్లా వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు జారీచేసింది. నామక్కల్ జిల్లా రాశిపురం సమీపం తొట్టియంబట్టి గ్రామానికి చెందిన శవరణ కుమార్ రూ.20 లక్షలకు కారు కొనుగోలు చేశాడు. కారు కొనుగోలు చేసిన 26 రోజుల్లోనే కారు బయట పెయింటు ఊడిపోయింది. ఈ విషయమై సదరు కారు సంస్థకు పలు మార్లు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోవడంతో జిల్లా వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలుచేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

● జయరాజ్ కంపెనీల డైరెక్టర్ తాడేపల్లి రాజశేఖర్



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని జయరాజ్ గ్రూప్ కంపెనీల డైరెక్టర్ తాడేపల్లి రాజశేఖర్ సూచించారు. కుండ్రత్తూర్‌లోని ముక్కాల నమ్మాళ్వార్ శెట్టి వివేకానంద విద్యాలయ సీనియర్ సెకండరీ పాఠశాల 24వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం జరిగింది. టి.జయశ్రీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. సంస్థ నిర్వాహకులు ఎన్‌వీ కన్నయ్య శెట్టి, ఎం.వెంకటేశపెరుమాళ్, ఎం.భాష్యకారులు, ఎం.శ్రీరాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాడేపల్లి రాజశేఖర్ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. తెలుగు కుటుంబాలకు చెందిన విద్యార్థులు మాతృభాషతో పాటు జాతీయ భాష హిందీ కూడా నేర్చుకోవాలని తెలిపారు. చదరంగం వంటి ఆటలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మెరిటోరియల్ విద్యార్థులకు ఆయన అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, వైస్ ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తమిళ చిత్రజ్యోతి

త్వరలోనే ఆ కోరిక నెరవేరుతుంది

● లోకేష్ కనకరాజ్


లోకేష్ కనకరాజ్ - అజిత్

ఇప్పటికే అగ్ర హీరోలు కమల్ హాసన్, విజయ్, విజయ్ సేతుపతి, కార్తీ వంటివారి చిత్రాలకు దర్శకత్వం వహించిన యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ చిత్రానికి దర్శకత్వం చేస్తున్నారు. త్వరలో మరో అగ్రహీరో అజిత్‌ను కూడా డైరెక్ట్ చేయాలన్న ఆశ ఉందని తన మనసులోని మాట వెల్లడించారు. 'మానగరం', 'ఖైదీ', 'మాస్టర్', 'లియో', వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీలను రూపొందించిన లోకేష్.. ఇపుడు రజనీకాంత్ హీరోగా 'కూలీ' మూవీ రూపొందించడంలో నిమగ్నమైవున్నారు. ఇందులో రజనీతో పాటు అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్ వంటి సీనియర్ నటులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. స్నేహానికి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ అతిథి ప్రాతలో కనిపించనున్నారు. శృతిహాసన్ హీరోయిన్. ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తి చేసుకోగా, తాజా షెడ్యూల్ థాయ్‌లాండ్‌లో జరుగుతుంది. 'కూలీ' తర్వాత 'ఖైదీ-2' తెరకెక్కించే లోకేష్.. ఆ తర్వాత అజిత్ చిత్రానికి దర్శకత్వం చేస్తానని వెల్లడించారు. 'ఇతర దర్శకులకు ఉన్నట్టుగానే అజిత్ హీరోగా ఒక చిత్రాన్ని రూపొందించాలన్న ఆశ మనసులో చాలా రోజులుగా ఉంది. ఇందుకోసం త్వరలోనే కృషి చేస్తాను. అతి త్వరలోనే ఈ కోరికను కూడా నెరవేరుతుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.

విశాల్ సింహంలా వస్తారు

● జయం రవి



హీరో విశాల్, ఆయన కుటుంబ సభ్యులకు ఉన్న మంచి మనసు కారణంగా త్వరలో విశాల్ సింహంలా వస్తారని మరో కోలీవుడ్ హీరో జయం రవి అన్నారు. సుందర్ దర్శకత్వంలో విశాల్, సంతానం ప్రధాన పాత్రల్లో నటించిన 'మద గజ రాజా' సినిమా ఈ నెల 12వ తేదీ విడుదలకానుంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇటీవల ఆ చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో హీరో విశాల్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో విశాల్ తీవ్రమైన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నప్పటికీ చిత్ర ప్రమోషన్‌కు హాజరుకావడాన్ని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. అదేసమయంలో ఆయన పరిస్థితి చూసి అనేక మంది చలించారు. మైకు కూడా పట్టుకోలేని స్థితిలో చేతులు వణికిపోతూ కనిపించగా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ నేపథ్యంలో విశాల్ ఆరోగ్యంపై జయం రవి స్పందించారు. 'విశాల్ మంచి మనసున్న వ్యక్తి. ఆయన కుటుంబ సభ్యులు కూడా అలాంటివారే. విశాల్ వంటి ధైర్యవంతుడు మరొకరు లేదు. ఇపుడు క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్నారు. త్వరలోనే పాత విశాల్‌ను చూస్తారు. విశాల్ ధైర్యమే ఆయనను కాపాడుతుంది. త్వరలోనే ఒక సింహంలా వస్తారు' అని పేర్కొన్నారు. కాగా, జయం రవి, నిత్యా మేనన్ జంటగా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' మూవీ పొంగల్‌కు విడులకు సిద్ధంగా ఉంది.

రజనీ బయోపిక్ తీయాలని వుంది

● దర్శకుడు శంకర్



దక్షిణ భారత చిత్రపరిశ్రమలో అగ్ర హీరో రజనీకాంత్, అగ్ర దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'యందిరన్', 'శివాజీ', '2.0' చిత్రాలు ఘన విజయం సాధించాయి. ఇపుడు రజనీకాంత్ 'కూలీ' సినిమాలో నటిస్తుండగా, శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ ఛేంజర్' శుక్రవారం పాన్ ఇండియా మూవీగా తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదలైంది. ఈ నేపథ్యంలో శంకర్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'రజనీకాంత్ బయోపిక్ తీయాలని ఉందని అన్నట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. నిజానికి ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ఆలోచన నాలో కలగలేదు. ఇలాంటి ప్రచారం జరిగేవరకు నా మదిలో ఈ ఆలోచన తట్టలేదు. ప్రతి ఒక్కరికీ రజనీ గురించి బాగా తెలుసు. ఒక్క క్షణం కూడా అలాంటి ఆలోచన చేయలేదు. కానీ మీడియా ప్రశ్నించగానే ఈ ఐడియా వచ్చింది. ఒకవేళ బయోపిక్ మూవీ తీస్తే మాత్రం రజనీకాంత్ బయోపిక్‌ను తీయాలన్నది నా కోరిక' అని వివరించారు.

అవార్డు... దేవుడిచ్చిన లంచం

● నిత్యా మేనన్



జాతీయ అవార్డు రావడం దేవుడు తనకు ఇచ్చిన లంచంగా భావించినట్టు హీరోయిన్ నిత్యామేనన్ అన్నారు. అలాగే, చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి హీరోయిన్‌గా స్థిరపడిన తర్వాత వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోయినట్టు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నగరంలో జరిగిన ఒక సినిమా ఫంక్షన్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, 'చిన్న వయసు నుంచే కెమెరా ముందు నిల్చొని నటించాలంటూ మా అమ్మ ఒత్తిడి చేస్తుండేది. నిజం చెప్పాలంటే సినిమా నాకు అస్సలు నచ్చదు. ఇటీవల సినిమా నుంచి వైదొలగి మరేదైనా చేస్తానని నా తల్లిదండ్రులకు చెప్పగా, వారు నా యిష్టానికే వదిలివేశారు. ఈ పరిస్థితుల్లో నాకు జాతీయ అవార్డు వచ్చింది. ఇక సినిమా నన్ను వదిలిపెట్టదని, దేవుడు నాకు ఇచ్చిన లంచంగా భావించాను. బాల్యం నుంచే కెమెరా ముందు నిల్చోవడం నాకు ఇష్టం లేదు. సినిమా నటిగా మారినప్పటి నుంచి వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోయాను. సహజత్వంతో కూడిన జీవితాన్ని అనుభవించలేదనే ఫీలింగ్ మనసులో ఏర్పడినపుడు అది పదేపదే డిస్టర్బ్ చేస్తూనే ఉంది. నిజానికి 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్' తరహా జీవితాన్ని గడపాలని ఆశపడ్డాను. ఫొటోలు తీయడమంటే అమితమైన ఇష్టం. కానీ, సినిమా పరిశ్రమకు దూరంకాలేని స్థితికి చేరుకున్నాను' అని నిత్యామేనన్ పేర్కొన్నారు.


చెరకు గడలు ఎంత తీపిగా ఉన్నాయో....!


అలనాటి గ్రైండర్


పొంగలో... పొంగల్ అంటూ...


పల్లెటూరి యువతుల వేషధారణలో...

పొంగలో... పొంగల్

● వల్లియమ్మాళ్ కళాశాలలో కోలాహలం


వినూత్న కర్రసాము...


నృత్య ప్రదర్శన ..

స్థానిక అన్నానగర్‌లోని వల్లియమ్మాళ్ బాలికల కళాశాలలో శుక్రవారం పొంగల్ వేడుకలు కోలాహలంగా సాగాయి. గ్రామీణ వాతావరణం ఉన్నట్టుగానే కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లికలు వేసిన విద్యార్థినులు, పొంగళి పెడుతూ 'పొంగలో... పొంగల్' అంటూ కేరింతలు కొట్టారు. అనంతరం జానపద గీతాలను విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు తాడు లాగడం, లెమన్ స్పూన్ సహా పలు పోటీలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు చెరకు గడల రుచి చూస్తూ ఆనందించారు. ఆద్యంతం పల్లె వాతావరణంలో సాగిన ఈ వేడుకల్లో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి


రంగవల్లికలు తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

ఎంత పే...ద్ద బెలూన్లో!

అచ్చెరువొందేలా ఎగిరిన బెలూన్లు


హాట్ ఎయిర్ బెలూన్

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్ రోడ్డు కోవలం సమీపంలోని తిరువిడందైలో 10వ అంతర్జాతీయ బెలూన్ ఫెస్టివల్ (టీఎన్‌ఐబీఎఫ్) శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 12వ తేది వరకు జరుగనున్న ఈ ఫెస్టివల్‌ను రాష్ట్ర మంత్రులు రాజేంద్రన్, టీఎం అన్బరసన్ ప్రారంభించారు. ఈ ఫెస్టివల్‌లో ఆస్ట్రేలియా, జపాన్, ఐరోపా, ఫ్రాన్స్, బ్రెజిల్, బెల్జియం, థాయ్‌లాండ్, వియత్నాం తదితర 8 దేశాలు పాల్గొన్నాయి. వీటిలో బేబి మాన్‌స్టర్ (బ్రెజిల్), హంగో ది ఛీటా (ఆస్ట్రేలియా), వెస్ ది వోల్ఫ్, ఉలి ది ఎలిఫెంట్ (యూకే) తదితరాలతో రూపొందించిన హాట్ ఎయిర్ బెలూన్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ప్రత్యేక అంశాలు...

ఈ ప్రాంగణంలోకి మధ్యాహ్నం 3 గంటలకు సందర్శకులను అనుమతించనున్నారు. ఈ ప్రాంతంలో షాపింగ్ ఫెస్టివల్, ఫుట్ కోర్ట్, కిడ్స్ గేమ్స్ తదితరాలు ఏర్పాటుచేశారు. సాయంత్రం 5.30 నుంచి బెలూన్ల ప్రదర్శన ప్రారంభమవుతుంది. హాట్ ఎయిర్ బెలూన్లు 5.30 నుంచి 6.30 గంటలు, స్పెషల్ షేప్ బెలూన్లు 6.30 నుంచి ఎగురవేస్తారు. అనంతరం రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు జరుగనున్నాయి. వాతావరణం, గాలుల వేగం తదితరాలు పరిగణలోకి తీసుకొని బెలూన్లు ఎగరవేయడంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ బెలూన్ ఫెస్టివల్ ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు పొల్లాచ్చి, 18,19 తేదీల్లో మదురై కలైంజర్ సెంటినరీ జల్లికట్టు మైదానంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.





బెలూన్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న మంత్రులు రాజేంద్రన్, అన్బరసన్

అమెరికా ఆర్ఐటీతో

'వీఐటీ చెన్నై' అవగాహన



ఒప్పందం కార్యక్రమంలో ప్రొఫెసర్ విశ్వనాథన్, ఆర్‌టీఐ ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రభు డేవిడ్ తదితరులు

ప్యారీస్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ప్రముఖ రోసెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆర్ఐటీ), చెన్నై వీఐటీ వర్శిటీ ఎనిమిది కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ రెండు విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ఏఐ అండ్ డేటా సైన్స్ సదస్సు ఘనంగా జరిగింది. అమెరికాలో ఆర్ఐటీ సంస్థ వివిధ రకాల ఆధునిక పరిశోధనలతో కూడిన విద్యావకాశాలను కల్పిస్తోంది. ఆర్ఐటీ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రభు డేవిడ్, వీఐటీ వర్శిటీ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కే.విశ్వనాథన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, తమ విద్యా సంస్థ అంతర్జాతీయ స్థాయి విద్య అందిస్తూ విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దుతోందని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ ప్రభుడేవిడ్ మాట్లాడుతూ, దూర దృష్టితో విద్యా రంగంలో ముందుకెళ్తున్న వీఐటీ విద్యా సంస్థలు భారతదేశ ప్రగతికి తమ వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సంస్థతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ద్వారా ప్రొఫెసర్లు, విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంచుతుందన్నారు. వేలూరులోని వీఐఎస్ అంతర్జాతీయ పాఠశాలలో ప్లస్ టూ చదువుకున్న విద్యార్థులకు ఆర్ఐటీలో ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు ప్రాధాన్యత కల్పిస్తామని హామీఇచ్చారు. అదే విధంగా చెన్నై, వేలూరు ప్రాంతాల్లోని వీఐటీలో చదువుకుంటున్న పట్టభద్రులకు కూడా తమ సంస్థలో చదువుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుడేవిడ్ చెప్పారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో వీఐటీ వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ జీవీ సెల్వం, వీఐటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వీఎస్ కాంచన, చెన్నై వీఐటీ ప్రోఛాన్స్‌లర్ త్యాగరాజన్, అడిషినల్ ప్రొఫెసర్ పీకే మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూషన్‌లో పొంగల్ సంబరాలు

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ కళాశాలలో గురువారం పొంగల్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని, రంగవల్లికలు, పొంగళ్లు పెట్టారు. వేడుకల్లో భాగంగా ఎద్దుల బండిపై ఎక్కిన విద్యార్థినులు ప్రాంగణంలోనే విహరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థుల కోసం 'మేకర్స్ క్లబ్' ప్రారంభం


'మేకర్స్ క్లబ్' ప్రారంభోత్సవంలో విద్యార్థులు, నిర్వాహకులు

అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రూరల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం మేకర్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. కొడుంగయూరు ఎళిల్ నగర్‌లో ఉన్న ఎళిల్ మోడల్ స్కూల్‌లో ఈ క్లబ్‌ను ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి షాన్ శంకరన్, ఫౌండర్ ప్రెసిడెంట్ సురేష్ గోపాలకృష్ణన్ ఆధ్వర్యంలో ఈ క్లబ్ స్థాపించగా, పాఠశాల హెచ్ఎం దానం, న్యాయవాది కె.సి.కుమార్ ఈ క్లబ్ ప్రారంభించారు. ఇందులో సెంటర్ కోశాధికారి సి.అన్బుమణితో పాటు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సైన్స్ ప్రతిభా పాటవాలను పెంపొందించే చర్యల్లో భాగంగా, ఈ తరహా క్లబ్ ప్రతి పాఠశాలలో ప్రారంభిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

'గోల్డెన్ లీగ్ న్యూ ఇయర్ 2025' ప్రారంభం



అడయార్, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): నగరానికి చెందిన సిల్వర్‌స్కై బిల్డర్స్ తమ కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపేలా 'గోల్డెన్ లీగ్ న్యూ ఇయర్ 2025' పేరుతో న్యూ ఇయర్ పార్టీ ప్రారంభించింది. ఈ కంపెనీ ఇప్పటివరకు మూడు ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. 900కు పైగా అపార్టుమెంట్స్, 18 ఎకరాల్లో ఇళ్ల స్థలాల ప్లాట్లను అభివృద్ధి చేసి విక్రయించింది. మూడోతరం వారసత్వంగా సిల్వర్‌స్కై లేక్‌సైడ్-3, ది స్ప్రింగ్స్, ది ఎడ్జ్ అండ్ ది వన్ పేరుతో వీటిని పూర్తి చేశారు. ఈ థర్డ్ జనరేషన్‌లో నిషాంక్ సకారియా, మిటుల్ దమని, ప్రతిక్ జైన్ కంపెనీ స్థిరమైన వృద్ధిని కొనసాగించేలా చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ ఆనంద క్షణాలను ఆస్వాదించేలా, తమ కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపేలా గోల్డెన్ లీగ్ న్యూ ఇయర్ 2025 పేరుతో న్యూ ఇయర్ పార్టీని ప్రారంభించారు.

జీఆర్టీ హోటల్‌లో బ్రెయిలీ డే వేడుకలు



అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీఆర్టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో 'వరల్డ్ బ్రెయిలీ డే' వేడుకలను నిర్వహించారు. జీఆర్టీ గ్రూప్స్‌కు చెందిన జీఆర్టీ రీజెన్సీ, రాడిసన్ జీఆర్టీ హోటల్స్, జీఆర్టీ బ్రైయిల్స్ హోటళ్ళతో పాటు రెస్టారెంట్లలో బ్రెయిలీ మెనూ అదుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని జీఆర్టీ గ్రాండ్ చెన్నై, రాడిసన్ బ్లూ హోటల్ అండ్ సూట్స్‌లో ప్రత్యేక వేడుకలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జీఆర్టీ హోటల్స్ సీఈవో విక్రమ్ కోటా మాట్లాడుతూ, బ్రెయిలీ డేను పురస్కరించుకుని తమ హోటల్స్ రెస్టారెంట్లలో బ్రెయిలీలో మెనూ, ఎన్జీవో, కమ్యూనిటీ సంస్థలతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

హిందూ కాలేజీలో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో తెలుగు శాఖ అధ్యాపకులు, విద్యార్థులు

అడయార్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరాంలో ఉన్న ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి కాలేజీకి సంక్రాంతి సెలవులు కావడంతో ఈ వేడుకలను ముందుగానే విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా తెలుగుదనం ఉట్టిపడే సంప్రదాయ వస్త్రాలను ధరించి ఎంతో ఉత్సాహంగా పొంగలి తయారు చేసి సూర్య భగవానుడుకి నైవేద్యంగా పెట్టారు. ఈ సందర్భంగా సీతమ్మ ఫైన్‌ఆర్ట్స్, ఎన్ఎస్ఎస్ సభ్యులు కావల్సిన ఏర్పాట్లు చేయగా, సీతమ్మ ఫైన్‌ఆర్ట్స్ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల సంచాలకుడు, ప్రధానాచార్యులు డాక్టర్ రాజేంద్ర నాయుడు, డాక్టర్ జి.కల్విక్కరసి, డాక్టర్ టి.కల్పన తదితరులు పాల్గొన్నారు.


తన కుమారుడి వివాహ వేడుకకు హాజరు కావాలని శనివారం ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులను ఆహ్వానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి కుమార్తె దీప కుటుంబం



ఐఐటీ మద్రాస్‌లో 'సారంగ్' పేరుతో గురువారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి, సంగీత దర్శకుడు ఇళయరాజా, మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ డి.కామకోటి

శ్రీవారి సేవలో ప్రముఖులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడు


రఘురామకృష్ణరాజు


నిమ్మల రామానాయుడు


హోం మంత్రి అనిత


రామ్మోహన్‌నాయుడు


చాముండేశ్వరీనాథ్, పుల్లెల గోపిచంద్

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వారిలో.. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు అనిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, సవిత, శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ రెడ్డి, గుమ్మనూరు జయరాం, బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, జగన్మోహన్, మురళిమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, శ్రీకృష్ణదేవరాయులు, మిధున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, కంచర్ల శ్రీకాంత్, కల్యాణి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ, సుహాసిని, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, సినీ నటుడులు రాజేంద్రప్రసాద్, సప్తగిరి, నిర్మాత బండ్ల గణేష్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, ఇండియన్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ ఉన్నారు.



ఇల వైకుంఠం

- పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ











శ్రీవారి ఆలయంలో దాదాపు 5 టన్నులు.. వెలుపల మరో 5 టన్నుల పుష్పాలు.. 1.20 లక్షల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణలే. విద్యుద్దీపాలంకరణలతో తిరుమల 'ఇల వైకుంఠం'గా మారింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మనసుదోచే విద్యుత్, పుష్పాలంకరణలో స్వామి కొండను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. శ్రీవారి ఆలయం ముందు వేసిన 'రంగనాథ స్వామి ఆలయ' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి దర్శనం అనంతరం భక్తులందరూ ఈ సెట్టింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు. పూలు, పండ్లతో చేసిన దేవతల అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈసారి మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో అలంకరణలు చేపట్టడంతో భక్తులు నూతన అనుభూతులను పొందుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహావిష్ణువు, శ్రీలక్ష్మీదేవి, గరుడ ఇతర దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు, సప్తగిరి వద్ద విద్యుత్ సప్త ద్వారాలు కూడా శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తొలిరోజు ప్రశాంతంగా..



- శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు
- స్వర్ణరథంపై ఊరేగిన స్వామివారు.. నేడు చక్రస్నానం

తిరుమల, జనవరి10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులతో తిరుమల కొండ సందడిగా మారింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను వేకువజామున 4.30 గంటలకు మొదలుపెట్టాలని అనుకున్నప్పటికీ.. ధనుర్మాసం కైంకర్యాలు కైంకర్యాలు త్వరగా పూర్తికావడంతో 3.50 గంటలకే దర్శనాలు మొదలయ్యాయి. ఉదయం 8.15 గంటల వరకు సుప్రీం, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులకు దర్శనం చేయించారు. ఆ తర్వాత టోకెన్లు పొందిన సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ల వారీగా దర్శనం చేయిస్తామన్నారు. ఇక, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంలో వేంచేపు చేసి ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథాన్ని టీటీడీ మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు లాగారు.

ఇబ్బంది పెట్టిన గేట్లు

శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన గేట్లతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఒకచోటు నుంచి మరోచోటికి వెళ్లేందుకు అవస్థ పడ్డారు. స్వర్ణరథం నిర్వహించే సమయంలో అక్కడక్కగా గేట్లను మూసివేయడంతో పిల్లలతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. వృద్ధులు, మహిళలు కూడా గేట్లను ఎక్కిదూకుతూ కనిపించారు. తిరుమలలో చలి భక్తులను గజగజ వణికించింది. శుక్రవారం మొత్తం ఎండ లేకపోవడంతో పాటు పొగమంచు ఉక్కిరిబిక్కిరి చేసింది.



మిగిలిపోయిన గదులు?

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పద్మావతి పరిధిలోని వందకుపైగా గదులు మిగిలిపోయినట్టు తెలిసింది. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజు గదుల పొందాలంటే శ్రీవారి దర్శనాని కంటే కష్టంగా భావిస్తారు. అలాంటిది శుక్రవారం ఏకంగా దాదాపు వంద గదులు ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉండిపోయినట్టు సమాచారం. వివిధ రకాల ప్రముఖుల కోసం వీటిని ఎవరికి కేటాయించకుండా వదిలేసినట్టు తెలిసింది. మరోవైపు గదులు లభించక చాలా మంది భక్తులు తీవ్రమైన చలిలో ఉండిపోయారు. కనీసం వారికైనా వీటిని కేటాయించి ఉంటే బాగుండేదంటూ పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

ఈయనే ఆ సార్!

- అసెంబ్లీ ప్రాంగణంలో డీఎంకే ఎమ్మెల్యేల నినాదం

ప్యారీస్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నా వర్సిటీ అత్యాచార ఘటనను ఖండిస్తూ నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకేకు దీటుగా సమాధానం చెప్పేవిధంగా డీఎంకే ఎమ్మెల్యేలు శుక్రవారం సచివాలయ ప్రాంగణంలో 'ఈయనే ఆ సార్' అంటూ నినాదాలతో హల్‌చల్ చేశారు. అన్నా వర్శిటీ విద్యార్థినిపై ఇటీవల జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే పార్టీలు ఆందోళన నిర్వహించాయి. ప్రస్తుతం జరుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ఎవరా సార్? అనే బ్యాడ్జీతో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈయనే ఆ సార్! అనే ప్లకార్డు ప్రదర్శించారు. డీఎంకే సభ్యులు చూపించిన ఈ ప్లకార్డుల్లో అన్నానగర్ చిన్నారి అత్యాచారం కేసులో అరెస్టయిన అన్నాడీఎంకే మాజీ నేత సుధాకర్‌తో ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి ఫోటో కూడా ఉండటం గమనార్హం.


అసెంబ్లీ బయట 'ఈయనే ఆ సార్' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డీఎంకే ఎమ్మెల్యేలు

- ఈరోడ్ ఉప ఎన్నిక

ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ

- 247వ సారి బరిలోకి ఎలక్షన్ కింగ్


తనిఖీలు చేస్తున్న పోలీసులు

పెరంబూర్, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ప్రారంభమైంది. 247వ సారి 'ఎలక్షన్ కింగ్' పద్మరాజన్ తొలిరోజే నామినేషన్ వేయగా, ఈ నెల 17వ తేది నామినేషన్ల దాఖలుకు చివరిరోజు. 18వ తేది నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా విడుదల కానుంది. నామినేషన్ల ఉపసంహరణకు 20వ తేది చివరి రోజు. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, 8వ తేది చిత్తొట్టిలోని ఐఆర్‌టీటీ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ రుగనుంది.

తొలిరోజు మూడు నామినేషన్లు...

నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగింది. పోటీచేసే జనరల్ విభాగాల అభ్యర్థులు రూ.10,000, ఎస్సీ, ఎస్టీ వర్గాలు రూ.5,000లు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంది. తొలి రోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వారిలో 247వ సారి ఎన్నికల రారాజు పద్మనాభన్ కూడా ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా గోపీనాథ్...?

దివంగత స్థానిక ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ చిన్నకుమారుడు సంజయ్‌సంపత్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలని ఈరోడ్ కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. అదే సమయంలో, డీఎంకే కూడా ఈ ఎన్నికల్లో పోటీచేయాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. తాము పోటీచేయాలా, కాంగ్రెస్‌కు అప్పగించాలా అనే విషయమై ఇరుపార్టీల నేతలు చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ అభ్యర్థిగా తిరుప్పూర్‌లో బనియన్ కంపెనీ అధినేత గోపీనాథ్ పోటీచేయాలని నిర్ణయించుకొని, ఢిల్లీ వెళ్లి అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఆయన 2014లో ఈరోడ్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2016 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే తరఫున గాంగేయం నుంచి పోటీచేసి పరాజయం పాలయ్యారు.